క్లుప్తంగా

వంట పాత్రల పంపిణీ



వంటపాత్రలు తరలిస్తున్న వాహనం వద్ద ఎంఈఓలు, సిబ్బంది

డెంకాడ: మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం పథకానికి అవసరమైన వంటపాత్రలను ప్రభుత్వం మంజూరు చేయడంతో వాటిని మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటరమణ, సీహెచ్ రాధాకృష్ణలు బుధవారం పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 66 ప్రభుత్వ పాఠశాలలకు ఆయా పాఠశాలల విద్యార్థుల నమోదు ఆధారంగా ఐదు రకాల వంటపాత్రలు ప్రభుత్వం మంజూరు చేసింది. బేసిన్లు, కళాయి, దోకులు, గరిటెలు, హస్తం వంటి పాత్రలను మండల విద్యావనరుల కేంద్రం నుంచి ఎండీయూ వాహనం ద్వారా అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: ఉపాధి హామీ వేతనదారులకు రోజుకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొండగుంపాంలో సచివాలయ సిబ్బందికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

మందుల స్కామ్‌పై దృష్టి సారించాలి..

- జూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు రామారావు

నెల్లిమర్ల: ఈఎస్సై డిస్పెన్సరీలో మందుల స్కామ్ జరుగుతోందని జూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అవసరం లేకపోయినా కొన్ని మందులకు ఇండెంట్ పెట్టాలని ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడం దారుణమన్నారు. ముఖ్యంగా ఆయా డిస్పెన్సరీల్లో రోగులకు అవసరమైన 279 రకాల మందులు కొనుగోలు జరుగుతుండగా.. 900 రకాల మందులు కనుగోలు చేయాలని చెప్పడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మందుల స్కామ్‌పై దృష్టి సారించాలని కోరారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం తగదని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్తా) జిల్లా శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటల్లోపు విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పాఠశాల విద్యాశాఖ తెలియజేయడం సరికాదన్నారు. 9.15 గంటలకు ప్రార్థన ముగుస్తుందని, పావుగంటలో విద్యార్థుల హాజరు వేసి, ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయగలమని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. భాస్కరరావు, వి. రమణ ప్రశ్నించారు. పాత పద్ధతి ప్రకారం 10.30 గంటల వరకు అవకాశం ఇవ్వాలని కోరారు.

ముత్యాలమ్మకు వెండి పీఠం



వెండి పద్మపీఠాన్ని ట్రస్టుబోర్డు సభ్యులకు అందజేస్తున్న దాతలు

విజయనగరం టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న వనంగుడిలో కొలువైన ముత్యాలమ్మకు వెండి పద్మపీఠాన్ని బహూకరించారు. జిల్లాకు చెందిన భమిడిపాటి రత్నమాల, భమిడిపాటి లక్ష్మీనరసింగరావులు అమ్మవారికి 1100 గ్రాముల బరువు కలిగిన పద్మపీఠాన్ని చేయించి ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు బలివాడ పార్వతికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూర్వ ఈఓ భానురాజా, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

215 ఓట్లపై అభ్యంతరాలు

నెల్లిమర్ల: నియోజకవర్గంలో 215 ఓట్లపై అభ్యంతరాలు వచ్చినట్లు తహసీల్దార్ డి. ధర్మరాజు తెలిపారు. మండలానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ డి. ధర్మరాజు బుధవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెరుగైన ఓటర్ల జాబితాకు రాజకీయ పార్టీల నాయకులందరూ సహకరించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా చేర్పించాలని సూచించారు.



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి



ఘటాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

పైడితల్లికి ప్రత్యేక పూజలు

సిరుల తల్లి పైడితల్లికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకోగా.. బుధవారం కూడా రద్దీ కొనసాగింది. ఆలయంతో పాటు అమ్మవారిని వివిధ పూలతో అందంగా ఆలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



ఆలయం లోపల పూల అలంకరణ

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేట్ రంగారావు



పూసపాటిరేగ: మెడికల్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

విజయనగరం: ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు అన్నారు. నగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మయూరి జంక్షన్ వద్దనున్న లార్డ్ కిచినర్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయా కేంద్రాలలో సుమారు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ పరీక్షలతో పాటు శస్త్ర చికిత్సలకు అవసరమైన పరీక్షలను కూడా జరిపి మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి రిఫరల్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఆరోగ్య శిబిరాలను అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్లు జీవీ రంగారావు, చందక శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడం శుభపరిణామమన్నారు. కార్పొరేటర్ జీవీ రంగారావు మాట్లాడుతూ, నగరంలో ఇప్పటివరకు 14 కేంద్రాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరిగాయన్నారు. సుమారు 9 వేల మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. 150 మందిని వివిధ శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాలను పరిశీలించారు.

అపూర్వ స్పందన...

నెల్లిమర్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల పరిధిలో నిర్వహిస్తోన్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన



నెల్లిమర్ల రూరల్: మెడికల్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

లభిస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మండలంలోని తంగుడుబిల్లిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇళ్ల వద్దే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పరీక్షలతో పాటు మందులు సైతం ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే సీఎం జగనన్న లక్ష్యమని.. ఆయన ఆలోచనలతోనే సురక్ష కార్యక్రమం రూపుదిద్దుకుందన్నారు. ఇకపై ప్రతి ఆరు నెలలకోసారి సురక్ష శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో సర్కారు వైద్యం అందని ద్రాక్షగా ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వంలో వైద్యులు ఇంటికే వచ్చి తనిఖీలు చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పిన్నింటి చిన అప్పలనాయుడు, మీసాల సూర్యకాంతం, ఎంపీడీఓ రామారావు, వైద్యులు సాయిరాం, సాయి నందిని, కార్యదర్శి యశోద, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సేవలు భేష్

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు భేషుగ్గా ఉన్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని కొల్లాయివలస సచివాలయంలో పరిధిలో గల పసపాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 454 మంది వివిధ పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నారు. అలాగే కంటివెలుగు పథకంలో భాగంగా పలువురికి నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బృహత్తర కార్యక్రమం చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, సర్పంచ్ పైడి సుజాత, ప్రజాప్రతినిధులు కంది వెంకటరమణ, తాడిశెట్టి బాబు, అచ్చంనాయుడు, ఎంపీడీఓ ఎం. రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైద్యాధికారిలు రాజేష వర్మ, ప్రమీలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమండల దీక్షలు

- కామాక్షి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



లలితా హోమం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడైన ఉమా సదాశివాలయంలో కామాక్షి అమ్మవారి తిరు మండల దీక్షలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రధాన అర్చకుడు రేజేటి మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో బుధవారం గణపతి పూజ నిర్వహించి, ఉమా సదాశివుడికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం కామాక్షి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. షోడశీ కళారాధన, శ్రీ చక్రార్చన, కుంకుమార్చన, చండీ సప్తపతీ పారాయణ, సువావర్ణార్చన, లలితా హోమం, తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కామాక్షి అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం లలితాహోమాన్ని తిలకించారు. కామాక్షి అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలి



కాలువ నిర్మాణంపై ముంజేరు గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు

- తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు

భోగాపురం: గ్రామంలో నెలకొన్న సమస్యలను శాంతియుతంగా సమన్వయంతో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు ముంజేరు సిద్ధార్థనగర్ కాలనీవాసులకు సూచించారు. ఈమధ్య కాలంలో సిద్ధార్థనగర్ కాలనీ సమీపంలో గ్రామంలోని వాడుకనీరు పోయేందుకు వీలుగా అధికారులు చేపట్టిన కాలువ నిర్మాణ పనులను కాలనీవాసులు పలుమార్లు అడ్డుకున్నారు. దీంతో ముంజేరు గ్రామ ప్రజలు సర్పంచ్ పూడిక నూకరాజును కలసి కాలువ నిర్మించాలంటూ పలుమార్లు స్పందన కార్యక్రమంలో అధికారులకు విన్నవించారు. మండలంలోని వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రజల ద్వారా విషయం తెలుసుకున్న తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు బుధవారం సాయంత్రం ముంజేరు గ్రామంలో ఇరువర్గాల ప్రజలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, కాలనీ మీదుగా కాలువ నిర్మిస్తే దోమలు వృద్ధి చెంది అంటు రోగాలు ప్రబలుతాయన్నారు. గతంలో ఏ విధంగా వాడుకనీరు పోయేదో ఆ మార్గంలోనే కాలువను నిర్మించాలన్నారు. దీనికి ముంజేరు వాసులు స్పందిస్తూ గతంలో గ్రామంలోని వాడుక నీరు ఐదు కాలువల ద్వారా బయటకు పోయేదన్నారు. ఇంకా కొంత నీరు రైతుల జిరాయితీ భూముల్లోకి పోతుండేదని చెప్పారు. అప్పట్లో జిరాయితీ భూములు ఖాళీగా ఉండేవని, ప్రస్తుతం అదే జిరాయితీ భూముల్లో రైతులు భవన నిర్మాణాలు చేపట్టడంతో నీరు పోయేందుకు అవకాశం లేకుండా పోయిందని గ్రామస్తులు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత ఎంపీడీఓ అప్పలనాయుడు, తహసీల్దార్ బంగార్రాజు స్పందిస్తూ దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలతో కాలువను నిర్మిస్తామని.. పంచాయతీలోని ప్రజలందరూ కలిసి శాంతియుతంగా సమావేశం ఏర్పాటు చేసుకుని ఒక నిర్ణయానికి వచ్చినట్లయితే కాలువ నిర్మాణం చేపడతామని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



చదురుగుడి వద్ద నిర్వహించిన తోలు బొమ్మలాట



వనంగుడి వద్ద బుర్రకథ ప్రదర్శన

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా దేవస్థానం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. బుధవారం స్థానిక మూడులాంతర్ల వద్దనున్న చదురుగుడి ఆవరణలో కాకినాడకు చెందిన పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన తోలుబొమ్మలాట చూపరులను ఆకట్టుకుంది. అదే విధంగా రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో కాళ్ల అప్పారావు బుర్రకథ ఆద్యంతం రక్తికట్టించింది. కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ. సుధారాణి పర్యవేక్షించారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న గంటా సత్యనారాయణ, తదితరులు

నెల్లిమర్ల: కనకదుర్గా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహించడం గొప్ప విషయమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గంటా సత్యనారాయణ (సతీష్) అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని మొయిద జంక్షన్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బూసురోతు శ్రీనివాస్, ఆలపాటి నాని, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



చిరుధాన్యాల వంటకాలను తిలకిస్తున్న కార్పొరేటర్ రంగారావు

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని 33వ డివిజన్ కార్పొరేటర్ జీవీ రంగారావు అన్నారు. బుధవారం స్థానిక నాగోజీపేటలో స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి. అనురాధ, కార్యకర్తలు శ్యామల, గాయత్రి, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

దాబాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు

లక్కవరపుకోట: దాబాల్లో మద్యం విక్రయించినా, మద్యం తాగేందుకు అనుమతి ఇచ్చినా దాబాల యజమానులపై కఠిన చర్యలు తప్ప వని ఎస్ఐ ముకుందరావు హెచ్చరించారు. మండలంలోని సంతపేట, గోల్డ్‌స్టార్ జంక్షన్, లక్కవరపుకోట జంక్షన్‌లోని దాబాల్లో పోలీస్ సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడు తూ దాబాల్లో మద్యం విక్రయాలకు అనుమతి లేదని, నిబంధనల ప్రకారం దాబాలు నడపాలని సూచించారు.

ఘనంగా దేవీ నిమజ్జనోత్సవం



గంట్యాడలో దుర్గాదేవిని ఊరేగిస్తున్న భక్తులు



ఎల్.కోట మండలం మల్లివీడులో అమ్మవారి ఊరేగింపు



ఎల్.కోటలో అనుపోత్సవం సందర్భంగా మహిళల కోలాటం



గుర్లలో దేవీ విగ్రహం ఊరేగింపు

గుర్ల/గంట్యాడ/లక్కవరపుకోట: శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గ్రామాల్లో మండ పాల వద్ద ఏర్పాటు చేసిన దేవీ విగ్రహాలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిమజ్జనం చేశారు. గుర్ల, గంట్యాడ, ఎల్.కోట మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను మేళతాళాలు, తీన్‌మార్ డ్యాన్స్‌లు, కోలాటాల మధ్య ఊరేగించారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనా గానం

చీపురుపల్లి: ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో బుధవారం అన్నమాచార్య సంకీర్తనా గానం కార్యక్రమం నిర్వహించారు. ఏ.కనకమహాలక్ష్మి బృందం ఆలపించిన కీర్తనలు భక్తులను అలరించాయి. ఆలయ ఈఓ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్టోబర్ 15 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్న ట్లు చెప్పారు. అందులో భాగంగానే రోజూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ నెల 28 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



కొత్తవలస మండలం చీడివలసలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొత్తవలస/లక్కవరపుకోట: వరి పంటకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. కొత్తవలస,లక్కవరపుకోట మండలాల పరిధిలోని చీడివలస, గొల్లలపాలెం, రేగ, సుందరయ్యపేట తదితర గ్రామాల్లో వరి పంట ను వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.విజయ ఆధ్వర్యంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.ఎం.శ్రీనివాసరావు,డాక్టర్ తేజేశ్వరరావు బుధవారం పరిశీలించారు. పంటను ప్రస్తుతం ఆకుముడత, దోమపోటు తెగుళ్లు ఆశించినట్లు గుర్తించారు. ఆకుముడత తెగులు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటిలో 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే ప్రస్తుతం గాలిలో తేమ,ఉష్ణోగ్రత అధికంగా ఉండడంతో దోమ పోటు ఎక్కువగా ఉందని, నివారణకు ఎకరానికి 120 గ్రాముల పైమెట్రోజైన్ మందును పిచికారీ చేయాలని సూచించారు. ఏడీఏ విజయ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు నేపథ్యంలో పంట ఎండిపోకుండా ఎకరానికి 200 లీటర్ల నీటిలో 2 కిలోల మల్టీకే మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.